# చినుకులు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

"మీరు వంట బాగా చేస్తారు. ముఖ్యంగా కూర చాలా బావుంది" చెప్పాడు విష్ణుమూర్తి.

"మా ఆవిడ దొండకాయే కాదు, ఏ కూరయినా బాగా చేస్తుందోయ్" చెప్పాడు భారతి భర్త స్వరూపరావు.

"థాంక్స్"-సంతోషాన్ని దాచుకుంటూ గొణిగింది భారతి. తన వంటని ఆఖరిసారి ఎవరు మెచ్చుకున్నారో ఆమెకి గుర్తులేదు. భోజనాలయ్యాక విష్ణుమూర్తి భారతిని అడిగాడు-

"చారు ఓ గ్లాసులో పోసిస్తారా? సుపర్బ్."

తను చేసిన చారు తాగుతున్న విష్ణుమూర్తంటే భారతికి అంతకుముందు అతని మీద ఏర్పడ్డ అభిమానం అధికం అయింది.

విష్ణుమూర్తి, స్వరూపరావు బాలా నగర్‌లోని ఓ ఫ్యాక్టరీలో టెక్నికల్ సూపర్‌వైజర్స్‌గా పని చేస్తున్నారు. మొట్ట మొదటిసారిగా ఓ ఆదివారం సాయంత్రం టీకి విష్ణుమూర్తిని పిలిచాడు స్వరూపరావు.

ఆ రోజు ముందు గదిలో ఇరవై నిముషాలసేపు కూర్చుని పుష్మా తిని, టీ తాగాడు విష్ణుమూర్తి. భారతిని పరిచయం చేశాడు స్వరూపరావు.

"ఇల్లు నీట్‌గా వుంచడం అందరికీ తెలిసే కళ కాదు. కంగ్రాట్స్" చెప్పాడు విష్ణుమూర్తి.

పదిహేను రోజుల తర్వాత ఓరోజు స్వరూపరావు పక్కింటికి ఫోన్‌చేసి భారతిని పిలిచాడు.

"ఏమిటి?" అడిగింది.

"ది అదర్ సైడ్ ఆఫ్ మిడ్‌నైట్‌కి టిక్కెట్స్ దొరికాయి. ఆరుంపావుకల్లా థియేటర్ దగ్గరికి వచ్చేయ్" చెప్పాడు స్వరూపరావు.

"ఏ థియేటర్?"

చెప్పాడు.

"టిక్కెట్లు ఎవరిచ్చారు?" అడిగింది భారతి ఇంట్రవెల్‌లో, వాటిని తన భర్త కొనలేదని తెలియగానే.

"విష్ణుమూర్తి.... ఓ ఫ్రండ్‌తో వెళ్ళాలని రిజర్వ్ చేయించుకున్నాడు. ఇంకేదో పని తగిలింది. వృధా అవుతాయని మనల్ని చూడమని ఇచ్చాడు."

ఆదివారం భోజనానికి పిలిచాడు స్వరూపరావు. పై ఆదివారం వస్తానని, అర్జెంట్ పనుందని చెప్పాడు విష్ణుమూర్తి.

భోజనం చేస్తూ భారతి వంటని మెచ్చుకున్నాడు. ఆమె మనసులో ఎంతో పొంగిపోయింది.

మరో ఆదివారం సాయంత్రం వచ్చి పది నిముషాలు కూర్చుని వెళ్ళిపోయాడు.

"మీ వారికి లంచ్‌లో తినడానికి మీరు బాక్స్‌లో ఇచ్చే టిఫిన్స్‌లో సగందాకా నేను కొట్టేస్తాను.... క్వయిట్ టేస్టీ" చెప్పాడు.

బ్రహ్మచారి అయిన విష్ణుమూర్తి స్వరూపరావు ఇంటికి తరుచు వస్తున్నాడు. భారతి పిల్లలిద్దరికీ బిస్కెట్స్ కాని, చాక్‌లెట్స్ కాని తెస్తున్నాడు వచ్చినప్పుడల్లా.

విష్ణుమూర్తి గురించి తరచు భారతి ఆలోచిస్తోంది. అందగాడు-మంచి జీతం. ఎందుకు పెళ్ళి చేసుకోడు ఇంకా?

భారతిలో అలాంటి భావం ఏర్పడుతుండగా ఎదురింటావిడ ఆ వూహని భారతిలో మొదటిసారిగా స్థిరం చేసింది.

"మీ విష్ణుమూర్తి చాలా బావుంటాడు. నువ్వంటే ఇష్టం వున్నట్లు కనపడతాడు నాకయితే. ఏమైనా ఇంట్రెస్ట్ వుంటే టైం వేస్టు చెయ్యక."

ఎదురింటావిడ గురించి భారతికి తెలుసు. పెళ్ళికి ముందు రెండు లవ్ ఎఫైర్స్ ఫెయిల్ అయ్యాయి. శీలానికి ఆట్టే ప్రాముఖ్యత ఇవ్వదు. తనకి నచ్చే మొగాడు ఎలా వుండాలో కూడా ఓసారి చెప్పింది - నలభై ఏళ్ళు నిండుతున్న ఆవిడ.

భారతికి స్వరూపరావుతో పెళ్ళయి తొమ్మిదేళ్ళు దాటుతున్నాయి. ఏడేళ్ళ కొడుకు. అయిదేళ్ళ కూతురు. తర్వాత ఆపరేషన్ చేయించేసుకుంది. తనభర్తంటే ఇష్టం. పిల్లలంటే ప్రాణం. పెళ్ళికి ముందు నుంచి వాళ్ళ అబ్బాయంటే ఎంతో ఆసక్తి చూపించేది. రెండుసార్లు అతనితో సినిమాకి రహస్యంగావెళ్ళింది. మొదటిసారి భారతి వంటిమీద పరాయిమొగాడి చెయ్యి పడటం అక్కడే. సినిమాహాలు కాబట్టి భారతిశీలంపొయ్యే అవకాశంలేకపోయింది. ఆ అవకాశం వుండే ప్రయివసీ గల ప్రదేశం వాళ్ళిద్దరికీ లభ్యమవలేదుకాబట్టి భారతి శీలం చెడలేదు.

స్వరూపరావుతో పెళ్ళయ్యాక పరాయి మొగాడిగురించిఆలోచించాల్సిన అవసరం ఎప్పుడూ రాలేదు. మొదటి రెండేళ్ళు కొత్త కాపురంలోని తియ్యదనం అంతా పరిపూర్ణంగా అనుభవించింది.

కొత్తదనం క్రమక్రమంగా తగ్గుతూంటే, హోటళ్ళలో భోజనాలు, పిక్‌నిక్‌లు, ఆటోలు మొదలైన ఖర్చులు తగ్గించేసి ఇంటికి కావలసిన వస్తువులు అమర్చుకోవటం నేర్చుకొంది. అయి

దేళ్ళలో అదీ అయిపోయింది. ఇప్పుడు ఇరవై తొమ్మిదేళ్ళ భారతికి జీవితం ఎంతో రొటీన్ అయిపోయింది. ఆమె బ్రతికే జీవితంలో కనీసం ఒక్క క్షణం కూడా కొత్తదనం లేదు.

ఆ పరిస్థితుల్లో ఎదురింటావిడ చెప్పిన మాటలు భారతిలో కొత్త ఆలోచనలను రేకెత్తించాయి. తనకు తెలియకుండానే విష్ణుమూర్తి వచ్చే సమయానికి అలంకరణలో, దుస్తుల్లో శ్రద్ధ తీసుకొంటోంది.

ఇదివరలా కాక, కాఫీ రుచి చూసి బావుందనుకుంటేనే ఇస్తోంది. అతను పొగిడేపొగడ్తల కోసం ఎదురుచూస్తోంది. అవి వినగానే ఎంతో తృప్తి.

తొమ్మిదేళ్ళు కాపరం చేశాక ఏ భర్తా కొత్తలో మెచ్చుకున్నట్లు మెచ్చుకోడు. వాటికి పూర్తిగా దూరం అయిన భారతికి విష్ణుమూర్తి మాటలు ఎంతో ఆహ్లాదంగా వున్నాయి.

మానసికంగా విష్ణుమూర్తి తనకి వారం వారం దగ్గరవుతున్న సంగతి గ్రహించింది భారతి. ఇదివరలో మొహమాట పడుతూ, కళ్ళెత్తి తనని చూడటానికే ఇబ్బందిపడేవాడు. కాని ఇప్పుడు విష్ణుమూర్తి ఎంతో ఫ్రీగా, జోకులు వేస్తూ నవ్విస్తూ మాట్లాడుతున్నాడు.

ఎనిమిది నెలల్లో ఎంత తేడా?

భారతికి తనమీద తనకే కోపంగా వుంది. ఏమిటి మనసులో ఈ పాడు ఆలోచనలు? తను ఇద్దరు పిల్లల తల్లి, తొమ్మిదేళ్ళుగా కాపురంచేస్తున్న భార్య. కాలేజీలో చదువుకునే పద్దెనిమిదేళ్ళ కన్నెపిల్ల కాదు. అయినా విష్ణుమూర్తికి మరింత సన్నిహితంగా వెళ్ళడానికి ప్రయత్నిస్తూనే వుంది. తన భర్తకి చూస్తూచూస్తూ తను ద్రోహం చేయలేదనే నమ్మకం ఇంకా కొంచెం భారతిలో మిగిలి వుంది.

తన ముప్పయ్యవ పుట్టిన రోజు అద్దంలో తనని చూసుకుంది భారతి. కాలేజీలో ఆఖరిరోజు తీయించుకున్న ఫొటోని చూసుకుంది.

తనలో ఎంత తేడా!

ముప్పై!

ముసలితనం ప్రారంభం అయ్యేది ముప్పయ్యవ ఏటేట. రోజురోజుకీ తను వృద్ధాప్యానికి ఇకనించి దగ్గరవుతుందన్న మాట.

తనలో ఇంకా ఆకర్షణ వుందా? ఇదివరకు తనని చూసినట్లు మొగాళ్ళు చూస్తారా? అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు, కళ్ళ క్రింద స్పష్టంగా నల్లటి చారలు, ఆపరేషన్ తర్వాత వచ్చిన వళ్ళు.

ఆ ఆదివారం విష్ణుమూర్తి కోసం ఎప్పటికన్నా ఆసక్తిగా ఎదురు చూసింది భారతి. కాఫీ కప్పు అందిస్తూ కావాలని అతని చేతిని తాకింది.

"ఇంకా ఎంతకాలం ఈ బ్రహ్మచర్య వ్రతం?" అని అడిగింది.

నవ్వాడు. బదులు చెప్పలేదు.

"సమ్‌బడీ ఈజ్ మిస్సింగ్ యూ" స్వరూపరావు చెప్పాడు.

"ఆర్, రేదర్ యు ఆర్ మిస్సింగ్ సమ్‌బడీ ఎవ్విరి నైట్...." అతనికి మాత్రం వినపడేలా గొణిగింది భారతి.

మళ్ళీ నవ్వాడు. అంతే.

'అసలా మట్టిబుర్రకి అర్థమైందా?' అనిపించింది భారతికి.

ఆ తర్వాత నెలరోజులదాకా భారతి రకరకాలుగా విష్ణుమూర్తిని టెంప్ట్ చెయ్యడానికి ప్రయత్నించింది. అతనిలో ఎలాంటి మార్పు లేదు.

తనలోని ఆకర్షణ, అందం మాయమయ్యాయనే భయం మొదలైంది ఆమెలో.


ఆరోజు భారతికి విష్ణుమూర్తి పరిచయం అయిన సంవత్సరం తర్వాత - అతనొచ్చినప్పుడు స్వరూపరావు లేడు. పోల్‌లో ఫ్యూజ్ పోతే, ఫిర్యాదు చేయడానికి ఫ్యూజ్‌కాల్ ఆఫీసుకి వెళ్ళాడు.

"ఇంకా స్సేపట్లో వస్తారు-కూర్చోండి" కాఫీ కప్పు అందిస్తూ అలవోకగా నవ్వింది. జవాబుగా నవ్వాడు.

"మిమ్మల్ని ఇంకో పేరుతో పిలవచ్చా" అడిగాడు.

"ఏం పేరది?" అడిగింది.

"భా బరువుగా భారంగా వుంది, అది అది తీసేసి పిలుస్తే........"భయం అతని కళ్ళలో స్పష్టంగా కనిపించింది. తడబడ్డాడు. తల వంచుకున్నాడు వెంటనే.



## కటకటాల్లో ఖైదీ

జీవితం చిత్రమైనదని అప్పుడనిపిస్తూ వుండేది
అది ఎంత విచిత్రమైందో ఈ కటకటాలలోనే తెలుస్తోంది
ఈ చీకటి నిగూఢ అద్భుత ప్రపంచంలోకి
ఏ శక్తి నన్ను విసిరేసిందో నాకు తెలీదుకాని
జైల్లోకి అడుగు పెట్టగానే తెలిసింది. మానవత్వమున్న మనుషుల్లో వద్దావవి
అతి నికృష్టమైన పరిస్థితులను చూస్తూ అచలితులు గా
అచేతనులుగా బ్రతకలేనివాళ్ళందరిని నేరస్థులంటుంది సమాజం
మేము నేరస్థులమే కావచ్చును.
చట్టం తెలియదుకాని న్యాయం తెలుసు
మెదడు వుండక పోవచ్చునుగాని. హృదయంలో దయ వుంది.
దివిసీమలో కుళ్ళిన శవాలను పూడ్చి పెట్టాము
అవనిగడ్డలో సముద్రునికి ఆనకట్టలు కట్టాము
వంశధార వరదబాధితులకు కటిక వుపోషముంది
ఆరువేలు విరాళంగా ఇచ్చాము
పాప పరిహారంగా వారంవారం రక్తదానం చేస్తూనే వున్నాము
మరి "సుప్రీమ్ కోర్టు" మాకిచ్చిన బహుమతేమిటో తెల్సా!
ఏడేళ్ళ కఠిన శిక్ష నుండి పదునాలుగేళ్ళకి పెంచారు.
ఎంత చేసినా. ఏమి చేసినా మమ్మల్ని ఏదో సాధించాలని
కులికే ఈ సమాజం అవస్థచూస్తే జాలి కలుగుతోంది.
ఇక్కడ అన్యాయమే చట్టం. న్యాయమే మినహాయింపు
మాలోని మూగ ఆవేదన. అంధకారంలో అన్వేషణ
నాలాటి దీనజీవుల రహస్య హృదయాంతర విషాదం
దిక్కులేని దుర్బలుల జీర్ణ ఆవేశం
ఎవరితో చెప్పుకోలేని అధమ చరిత్రల గర్భశోకం
ఇంకా ఏ సందర్భమైనా.
లోహపు బిళ్ళలకి. చెత్త కాగితాలకి విలువనిచ్చే ఈ సమాజంలో
మానవ సహజమైన స్పందనని రేకెత్తించలేదని నాకు తోస్తోంది.

— తోపుదుర్తి భాస్కర్

"....పిలుస్తే?" అడిగింది.

"మీ రూపానికి సరిపోతుంది ఆ పేరు"

కొన్ని క్షణాలు వెంటనే భారతికి అతని మాటలు అర్థం కాలేదు. అర్థమయ్యాక చెప్పింది.

"థాంక్స్."

"వెల్‌కం....మీకా వుద్దేశం వుంటే ఇవాళ, రేపు లేదా ఎల్లుండి మధ్యాహ్నం మూడునించి గదిలోనే వుంటాను. రండి నాకా వుద్దేశం చాలా కాలంగా వుంది. లేకపోతే నా ఫ్రాంక్‌నెస్‌ని మన్నించండి."

కాఫీ తాగి వెళ్ళిపోయాడు. భారతికి వంట్లోంచి వణుకు ప్రారంభం అయింది.

ఛీ!

తను తన అందాన్ని పరీక్షించుకోడానికి ఏం పనిచేసింది? లేకపోతే అలా ఏ మగాడైనా తనతో మాట్లాడగలడా?

బాధవెయ్యలేదు. కోపం రాలేదు.

సంతోషం కలిగింది చెప్పలేనంత.

ఆ ఆలోచనే ఎక్సయిటింగ్‌గా వుంది.

రహస్యం.

కొత్తదనం.

తన పడక గదిలోలాగ గాక, ఒకర్నొకరు పొగుడుకొనటం, మెచ్చుకోవటం అంతా పెళ్ళయిన కొత్తలోలాగా. రెండు రోజులు అతని గదికి వెళ్ళడానికి ధైర్యం చాల్లేదు. అన్యమనస్కంగా అతని ఆహ్వానం గురించే ఆలోచించసాగింది.

తన భర్తకి ద్రోహం చేయగలదా? చేశాక గిల్టీగా ఫీలవుతుందా?

మూడోరోజు వుదయం ఎదురింటావిడకి సంగతి చూచాయగా చెప్పి సలహా అడిగింది.

"ఇంతదాకా ఏంకాలేదా?" ఆశ్చర్యంగా అడిగిందావిడ.

మధ్యాహ్నం ఒకటిన్నరకి డ్రస్సింగ్ టేబిల్ ఎదురుగా కూర్చుంది. రెండుంపావుకి ఇల్లు తాళంవేసి బయటకి వచ్చింది. ఆటోలో బయలుదేరింది. అతని గదికి వందగజాల దూరంలో ఆపించింది ఆటోని.

కిందకి దిగింది.

తెరచి వున్న తలుపు. నీలంరంగు కర్టెన్ కనపడుతున్నాయి. ఆటోఫేర్ చెల్లించి, ఆ గది వైపు నడిచింది. పదడుగులు వేశాక ఆగిపోయింది.

ఏదో శక్తి. అదృశ్య హస్తం తనని ఆపుతున్న భావన. వెనక్కి తిరిగి వెళ్ళి అదే ఆటోలో కూర్చొని ఇంటికి వెళ్ళిపోయింది.

'వెళ్ళివుంటే బావుండేది' అనిపించింది, ఇంటిముందు ఆటో దిగుతుంటే.

రెండు వారాలదాకా విష్ణుమూర్తి రాలేదు. వచ్చాక ఎప్పటిలానే వున్నాడు. అతని కళ్ళలోమాత్రం 'ఎందుకు రాలేదు?' అన్న ప్రశ్న కష్టంగా కనిపించింది భారతికి.

ఆ మర్నాడే నిర్ణయించుకుంది భారతి.

'ఒక్కసారే. ఒకే ఒక్కసారి.'

"పై ఆదివారం నేను వస్తే వస్తాను వుండండి" విష్ణుమూర్తితో రహస్యంగా చెప్పింది భారతి.

"వెల్‌కం".

ఆ ఆదివారం ఉదయం వచ్చాడు విష్ణుమూర్తి.

రహస్యంగా మాట్లాడే అవకాశం లేక పోయింది ఇద్దరికీ. ఆ రోజే భారతి తండ్రి కూడా వచ్చాడు. మూడయ్యేకొద్దీ భారతిలో ఆదుర్దా. ఏదో తెలియని ఆత్రం. బయట ఆకాశంనిండా మేఘాలు.

"నాన్నగారూ, నేను బయటకెళ్ళి ఓ గంటలో వస్తాను" చెప్పింది.

"కూరలకా?" అడిగాడు స్వరూపరావు.

"రమ వాళ్ళింటికెళ్ళి వచ్చేటప్పుడు కూరలు తెస్తాను.... వీలుంటే".

"వాళ్ళమ్మకెలా వుంది?"

"అది చూడటానికే వెళ్తున్నాను."

సన్నగా వర్షం మొదలైంది.

ఈసారి ఆటో అతని గదికి కొద్ది దూరంలో ఆపాక ఇదివరకటి బెరుకుతనం లేదు. స్థిర నిశ్చయంతో కురిసే చినుకుల్లో ఆటో దిగబోయింది. అతని గది తలుపు వేసి వుండటం చూసి ఆగింది.

బయట తాళం లేదు. అంటే వున్నాడన్న మాట. బయట వర్షం. లోపల వెచ్చగా అతని చేతుల్లో నలి........ భారతి మనసులోని కోరిక వాటికర్థమయినట్లుగా విష్ణుమూర్తి గది తలుపులు తెరచుకున్నాయి.

ఆ గదిలోంచి బయటకు అడుగు పెట్టింది. చేత్తో జుత్తు సవరించుకుంటూ—ఎదురింటావిడ!

భారతి వూపిరి పీల్చుకోవడం కూడా మర్చిపోయి అలాగేనిశ్చలంగా కూర్చుండి పోయింది.

ఎదురింటావిడ!!

నలభై ఏళ్ళ ఎదురింటావిడ!!!

లుంగీతో వున్న విష్ణుమూర్తి గుమ్మంలోంచి బయటకి వచ్చాడు. వర్షాన్ని గమనించి ఆవిడతో ఏదో అన్నాడు. ఆవిడ కొద్దిగా అయిష్టంగానే మళ్ళా లోపలికి వెళ్ళింది. తలుపులు మూసుకున్నాయి.

"వెనక్కి తిప్పు" చెప్పింది డ్రయివర్తో. చెప్తూంటే ఎవరో కంఠం నొక్కినట్లు మాటలు తడబడ్డాయి.

"అయామ్ ఎ ఫూల్. అయామ్ ఎ రియల్ ఫూల్.... తన భార్య కాని ప్రతీ ఆడది, ఏ వయసుదైనా సరే. మగాడికి అందంగా ఆకర్షణీయంగానే వుంటుంది. థాంక్ గాడ్.

ఈ సంగతి ఏం జరక్కుండానే గ్రహించగలిగాను. మా నాన్న రాకవల్ల నేను రానని అనుకుని వుంటాడు. గాడ్, నా కళ్ళు తెరిపించినందుకు నీకు మిలియన్ థాంక్స్. భగవంతుడా మళ్ళీ జీవితంలో ఇలాంటి వెధవ పనుల జోలికి వెళితే నన్ను చెప్పెట్టి కొట్టు" అనుకుంది మనసులో.

ఇంటికి చేరే సమయానికి తుఫాను వెలసిన కదలిలా వుంది భారతి మనసు.

"రమ వాళ్ళఅమ్మగారెలా వున్నారు?" భర్త అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పింది భారతి.

"ఏమో! వెళ్ళలేదు. మీ కిష్టమని మార్కెట్టంతావెదికి బెంగుళూరు వంకాయ తెచ్చాను. రాత్రికి చేస్తాను."

"బెంగుళూరు వంకాయ! బాగా ఖరీదుగా వుందని నేను...."

"ఏం? ఖరీదైతే కొనకూడదా?"

తొమ్మిదేళ్ళలో భారతి అతి చవకగా వుండే కంద బదులు, ఖరీదైంది కొనటం అదే మొదటిసారి.

ఆశ్చర్యంగా చూశాడు స్వరూపరావు.


బదులుగా మధురంగా నవ్వింది భారతి.

బయట చినుకులు పడుతూనే వున్నాయి.

## వానలో చెట్లు

నిండుగా వర్షం హర్షిస్తున్నట్లు
నిఖిలలోకం నిలువునా పులకిస్తున్నట్లు
పులకింతలతో బిగుసుకున్న
పుడమీతలంపై
మంచిగంధం అరగతీస్తున్నట్లు
బాష్పాంబు పూరమై ఆనందం విరిసినట్లు
జడులు జడులుగా కురుస్తోంది వాన!
సంతోషం పాయలు పాయలైన వాన!!
వానలో తడుస్తున్న తరువులు
సచేల స్నానమాడుతున్న తరుణులు!

అలవికాని ఆనందానికి
పట్టలేని సంతోషం పరదా....
ఊగిపోతున్న తలలపై
రెక్కల టపటపల మందహాస ప్రవాహాలు
వడగాడ్పులకు మూర్ఛపడిన ఆశ
తిరిగి ఆకుపచ్చగా మొలకెత్తుతోంది..
అవని అంతా ఆకుపచ్చదనం!
మానుల మొదళ్ళపై గిరిగిరా తిరుగుతూ
భూమిని గుండ్రంగా తిప్పుతూ
ఏ వేపు చూసినా చిలకాకు పచ్చ టొంగరాలు!



—శశికాంత్ శాతకర్ణి